## క్లుప్తంగా

### ఎంవీపీ సీఐగా కేఎన్ఎస్‌వీ ప్రసాద్



ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ శాంతి భద్రతల పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కేఎన్ఎస్‌వీ ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి సోమవారం ఉదయం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐగా ఉన్న ఆయన్ను ఎంవీపీ లా అండ్ ఆర్డర్ సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎంవీపీ కాలనీ సీఐగా సేవలందిస్తున్న మురళీని సిటీ వీఆర్‌కు బదిలీ చేశారు. అయితే సీఐ మురళీపై పలు కేసుల సెటిల్‌మెంట్లపై ఫిర్యాదులు పెరగడంతోపాటు కోర్టు కేసులు కారణంగానే వీఆర్‌కు పంపినట్లు ప్రచారం జరుగుతోంది. కొత్త సీఐ ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

### ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

మద్దిలపాలెం : ప్రజాస్వామ్య పరిరక్షణకు అందరూ కృషి చేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ ఎన్నేళ్లయినా స్థిరంగా ఉండడానికి భారతీయ ఓటర్లే కారణమన్నారు. ఏయూ పొలిటికల్ సైన్స్ – పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రటిక్ ఎంగేజ్మెంట్ అండ్ అకౌంటబిలిటీ ఫౌండేషన్ (ఐడియా) సంయుక్తంగా అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఎన్ని కుల సమీకరణలు జరిగినా, ఎన్ని ప్రజాస్వామిక దుర్ఘటనలు ఎదురైనప్పటికీ అందరూ ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేశారని కొనియాడారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువల వల్లే ప్రపంచంలో భారత్ మహోన్నత దేశంగా నిలుస్తోందన్నారు. ఆచార్య ఈఏ నారాయణ, పాలిటిక్స్ విభాగాధిపతి ఆచార్య ప్రేమానందం, ఐడియా చైర్మన్ డాక్టర్ తాడి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

### అద్దె బస్సుల డ్రైవర్ల జీతాలు పెంచాలి



వాల్తేర్ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, యూనియన్ నాయకులు

ఎంవీపీ కాలనీ : వాల్తేర్ డిపో హైర్ బస్సుల (అద్దె బస్సుల) డ్రైవర్ల జీతాలు పెంచాలని ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ మేరకు డిపో కార్యాలయం ఎదుట ఏపీఎస్ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వాల్తేర్ డిపో అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.వెంకటరావు సోమవారం మాట్లాడుతూ హైర్ డ్రైవర్స్ జీతాల అగ్రిమెంట్ పూర్తయి 11 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఓనర్స్ పెంచకపోవడం అన్యాయమన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిన అవసరమున్నా అద్దె బస్సుల యాజమాన్యంతో డిపో అధికారులు చర్చించడం లేదన్నారు. దీంతో చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోలేక డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా బస్సుల యజమానులు, అధికారులు స్పందించి డ్రైవర్లకు న్యాయం చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, సంఘాల నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

### ఫార్మా రంగానికి కేంద్రం సహకరించాలి



కేంద్ర మంత్రితో ఫార్మా రంగ ప్రతినిధులు

ఏయూ క్యాంపస్ : ఫార్మా రంగంలో జాతీయ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని ఎస్ఆర్‌సీ లేబొరేటరీస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏలూరి రామచంద్రా రెడ్డి కోరారు. విశాఖ నగర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి జె.పి.నడ్డాతో ఫార్మా రంగ పరిశ్రమలపై సోమవారం చర్చించారు. పరిశ్రమల విస్తరణతోపాటు వైద్య పరికరాల తయారీని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో 12 బిలియన్ డాలర్ల విలువ కలిగిన వైద్య పరికరాల రంగం 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు పైగా పెరుగుతుందన్నారు. విశాఖ, అనకాపల్లి, కాకినాడ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన క్లస్టర్లుగా అభివృద్ధి చేయాలని కోరారు. తద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు దేశీయ ఉత్పత్తి పెరుగుదల, ఎగుమతుల వృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, మంత్రి టి.జి.భరత్, పరిశ్రమల కార్యదర్శి యువరాజ్ పాల్గొన్నారు.

---

- కంబాలకొండలో అరకొరగా అభివృద్ధి పనులు
- ఎకో టూరిజం పార్కులో రూ.2 కోట్లతో పనులకు అటవీశాఖ శ్రీకారం
- వాటిలో కొన్నింటికి టెండర్లు లేకుండా... అనుయాయులకు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టేసిన అధికారులు
- ఫలితంగా నాణ్యతకు తిలోదకాలిచ్చి ఇష్టారాజ్యంగా పనులు
- పది నెలలు గడుస్తున్నా నేటికీ పూర్తికాని వైనం
- అసంపూర్తిగా కర్రల బ్రిడ్జి, పాత్‌వేలు, యోగా భవన నిర్మాణం
- కొరవడిన ఇంజినీర్లు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ



ఇదీ పరిస్థితి : పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా గోడల స్థాయి దాటని కాటేజీల నిర్మాణం



మధ్యలో పనులు నిలిచిపోయిన కర్రల వంతెన

# 'నగర వనం' నిధులు దుర్వినియోగం..!



రాళ్లు పేర్చి వదిలేసిన పాత్‌వేలు



సగం పనులు మాత్రమే పూర్తయిన రిక్రియేషన్ హాల్



రిక్రియేషన్ హాల్ చుట్టూ ప్రహరీ కోసం తవ్వి వదిలేసిన గోతులు

ఆరిలోవ : జాతీయ రహదారి పక్కన కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులు అరకొరగా సాగుతున్నాయి. ముఖ్యంగా నాణ్యతకు తిలోదకాలిచ్చేసి మమ అనిపించేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ కొన్నేళ్లుగా సౌకర్యాలు లేకపోవడంతో ఈ పార్కుకు సందర్శకులు వెళ్లడం మానేశారు. దీంతో గత ఏడాది కార్తీక మాసం ముగిసిన తర్వాత ఈ పార్కును అభివృద్ధి చేయాలని, సందర్శకులను ఆకట్టుకునేలా ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'నగర వనం' నిధులతో పనులు చేపట్టాలని అటవీశాఖ అధికారులు సిద్ధమయ్యారు. దీంతో సుమారు రూ.2 కోట్ల నిధులతో ఈ పార్కులో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ ఏడాది మే, జూన్ నాటికి పనులు పూర్తిచేసి సందర్శకులకు వినోదం కల్పించే విధంగా చర్యలు చేపట్టారు. ఇక్కడ రిక్రియేషన్ హాల్, కర్రల వంతెన, రెండు చోట్ల కర్రలతో పగోడాలు, పర్ణశాల, రెండు చోట్ల ఐదు కాటేజీలు, పాత్‌వేల నిర్మాణం ప్రారంభించారు. అయితే ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు తూతూ మంత్రంగా సాగుతున్నాయని, అరకొర పనులతో మమా అనిపించేస్తున్నారని ఇక్కడకు వెళ్తున్న సందర్శకుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పనులలో కొన్నింటిని టెండర్లు లేకుండా అధికారులు నామినేషన్ పద్ధతిలో తమ అనుయాయులకు అప్పగించినట్లు సమాచారం. అందుకే ఇక్కడ జరుగుతున్న పనులపైన పర్యవేక్షణ చేయకుండా వదిలేయడంతో తూతూ మంత్రంగా చేసుకుపోతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 'నగర వనం' నిధులను అధికారులు దుర్వినియోగం చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ పనులను ప్రత్యేకంగా పర్యవేక్షించాల్సిన ఇంజినీర్లు అటువైపు చూడకపోవడం విశేషం.

**నెలలు గడుస్తున్నా అసంపూర్తిగా పనులు**

- కంబాలకొండ ఎకో టూరిజం పార్కు అభివృద్ధిలో భాగంగా క్యాంటీన్ సమీపంలో నిర్మించిన మూడు కాటేజీలు పూర్తయ్యాయి. బోటింగ్ కొలను వద్ద చేపడుతున్న రెండు కాటేజీల పనులు నేటికీ గోడలకే పరిమితమయ్యాయి. పూర్తి చేసిన మూడు కాటేజీల నిర్మాణంలో నాణ్యత కొరవడిందనే ఆరోపణలున్నాయి.
- బోటింగ్ కొలను వద్ద ఖాళీ స్థలం చుట్టూ సందర్శకులకు ఆహ్లాదం కలిగించే విధంగా రాళ్లతో నిర్మించే పాత్‌వే పనులు తూతూ మంత్రంగా చేపట్టారు. ఇక్కడ రాళ్లు పేర్చి మధ్యలో వేసిన మట్టి ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో ఆ రాళ్ల మధ్య పెద్ద ఖాళీలు ఏర్పడి సందర్శకులు నడవలేని విధంగా తయారైంది.
- బోటింగ్ కొలను సమీపంలో రిక్రియేషన్ క్లబ్ ఏర్పాటు చేయడానికి కొన్నేళ్ల క్రితమే అధికారులు పునాదులు, పిల్లర్లు వేసి వదిలేశారు. దానిపై ఇప్పుడు రేకులు వేసి యోగా కేంద్రంగా ఏర్పాటు చేయదలిశారు. దీనిపై ఇప్పుడు రేకులతో పైకప్పు ఏర్పాటు చేసి లోపల పనులు పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. దీని చుట్టూ గోతులు తవ్వించి రక్షణ గోడ నిర్మించకుండా అస్తవ్యస్తంగా వదిలేశారు.
- పార్కు మధ్యలో క్యాంటీన్‌కు ఎదురుగా పిక్నిక్ స్పాట్ వద్ద సుమారు 150 మీటర్ల పొడవున కర్రలతో వంతెన నిర్మించదలిచారు. ఈ పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. దీని కోసం వినియోగించిన కర్రలు వర్షాలకు తడిచిపోయి చెదలు పడుతున్నాయి. ఈ వంతెన పనులు పూర్తి చేసిన తర్వాత కర్రలు పాడవకుండా రసాయనాలతో కూడిన నూనెలు రాయాల్సి ఉంది. పనులు పూర్తి కాకపోవడంతో ఆ కర్రలు వర్షాలకు తడిచిపోయి చెదలు పడుతున్నాయి. దీంతో వాటి నాణ్యత ప్రశ్నార్థకంగా మారనుంది.

**ఇన్నాళ్లూ సందర్శకులకు మిగిలింది నిరాశే...**

కార్తీక మాసంలో పిక్నిక్‌లకు తప్ప మిగిలిన రోజుల్లో కంబాలకొండ వైపు ఎవరూ కన్నెత్తి చూడడం లేదు. ఇందులో సందర్శకులకు వినోదం కరువైంది. గతంలో ఉన్న కాటేజీలు నేలకూలాయి. చుట్టూ పచ్చిన కొండలు, పర్యావరణాన్ని సందర్శకులు తిలకించి, వినోదం పొందే వాచ్ టవర్ హుదూద్ తుపాన్ కంటే ముందే కుప్పకూలింది. అప్పటి నుంచి అటవీశాఖ అధికారులు ఈ పార్కును గాలికి వదిలేశారు. ఉన్నతాధికారులు ఈ పార్కును పలుసార్లు సందర్శించినప్పుడల్లా ఈ ఏడాది అభివృద్ధి చేస్తామంటూ ఏళ్ల తరబడి గడిపేశారు. దీంతో ఇక్కడ వినోదం కరువై సందర్శకులు ముఖం చాటేశారు. ఈ పార్కులో ఏముందో తెలియక లోపలకు వెళ్లిన కొందరు సందర్శకులు వినోదం కరువై నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా అరకొరగా చేస్తుండడంతో ఈ పార్కుకు సందర్శకులు ఎన్నాళ్లు వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

---

## స్వీయ ఆవిష్కరణలతో అభివృద్ధి సాధ్యం

**విశాఖ నావికాదళం చీఫ్ ఇంజినీర్ పంకజ్ త్యాగి**



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పంకజ్ త్యాగి, తదితరులు

మద్దిలపాలెం : స్వీయ ఆవిష్కరణతో దేశం అభివృద్ధి సాధిస్తుందని విశాఖ నావికాదళం చీఫ్ ఇంజినీర్ పంకజ్ త్యాగి అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థుల వార్షిక సమ్మేళనం యాక్సెస్ 2కె 25ను ఆయన ప్రారంభించారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పంకజ్ త్యాగి మాట్లాడుతూ పర్యావరణహితంగా నిలిచే నిర్మాణాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. భవిష్యత్ భారతావనిని నిర్మించే బాధ్యతను యువతరం తీసుకోవాలన్నారు. రైల్వే నిర్మిస్తున్న అత్యంత ఎత్తైన ప్రాజెక్టులు భారత దేశ సాంకేతిక అభివృద్ధికి నిదర్శనమన్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా ప్రత్యక్ష అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఐఐటీ కాన్పూర్ ఆచార్యులు ఎం.ఆర్.మాధవ్ మాట్లాడుతూ సమాజాన్ని అభివృద్ధి చేయగలిగే శక్తి ఇంజనీర్లకు ఉందన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు, సమన్వయకర్త ఆచార్య ఎస్.యజ్ఞని, విభాగ ఆచార్యులు పాల్గొన్నారు.

## సాంకేతికత కోసం విదేశాలపై ఆధారపడకూడదు



ప్రసంగిస్తున్న ఆచార్య గంటి రాధాకృష్ణ

మద్దిలపాలెం : సాంకేతిక పరిజ్ఞానం కోసం విదేశాలపై ఆధారపడకుండా, దేశీయంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఐఐటీ మద్రాస్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగ ఆచార్యులు, భట్నాగర్ అవార్డు గ్రహీత గంటి రాధాకృష్ణ అన్నారు. ఏయూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన డాక్టర్ ఆర్.విజయశాంతి స్మారక ఉపన్యాసంలో ఆయన భారతదేశంలో 5జీ టెక్నాలజీ అభివృద్ధి అనే అంశంపై ప్రసంగించారు. టెలికం రంగానికి అవసరమైన ఉత్పత్తులను అధికంగా దిగుమతి చేసుకుంటున్నామని, వీటిని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. దేశీయంగా పరిశ్రమలు అభివృద్ధి చెందితే ఇది సాధ్యపడుతుందని చెప్పారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ విభిన్న జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం ఆచార్య రాధాకృష్ణను సత్కరించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు పలు అంశాలపై మోడల్స్ తయారుచేసి ప్రదర్శించారు. వీటిని వీసీ పరిశీలించి విద్యార్థులను అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు, విభాగాధిపతి ఆచార్య జ్యోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

## రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలి



నిరసన తెలుపుతున్న రజక సంఘం నాయకులు

బీచ్‌రోడ్డు : రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సమస్యలపై సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ విశాఖ జిల్లాలో రజక వృత్తిదారులు సుమారు 50 వేల మంది ఉన్నారన్నారన్నారు. వారికి పక్కా ఇళ్లు, దోబీగాట్లు లేవని, లాండ్రీ పని చేయుటకు స్థలాలు లేవన్నారు. కుల వృత్తి చేసుకునే అవకాశం లేక నగరంలోని అపార్ట్‌మెంట్స్‌లో వాచ్‌మెన్‌గా, ఇంటి పని వారిగా చేస్తూ జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రజకులపై అగ్రవర్ణాల దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, చీటింగ్ కేసులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారన్నారు. వాటి నుంచి రక్షణ కోసం రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని కోరారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, కూటమి నాయకులు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే రజక వృత్తిదారులంతా జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం.అప్పారావు, ఈశ్వరరావు, కోటి బాబు పాల్గొన్నారు.

## రోడ్లు, స్టీల్‌ప్లాంట్ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు



హెచ్‌బీ కాలనీలో క్రేన్ సాయంతో బడ్డీల సామగ్రి తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మద్దిలపాలెం : జీవీఎంసీ 15, 16వ వార్డుల్లో రోడ్లు, స్టీల్‌ప్లాంట్ స్థలాలు ఆక్రమించి బడ్డీలు ఏర్పాటు చేస్తే తొలగించడంతోపాటు చర్యలు తీసుకుంటామని హెచ్‌బీ కాలనీ స్టీల్‌ప్లాంట్ స్థలాల భద్రత ఇన్‌చార్జి ఆంజనేయులు, జోన్ – 3 టౌన్‌ప్లానింగ్ అధికారులు హెచ్చరించారు. హెచ్‌బీకాలనీలో స్టీల్‌ప్లాంట్ స్థలాలకు ఆనుకుని ఉన్న, రోడ్లపై ఏర్పాటు చేసిన బడ్డీల సామగ్రిని సోమవారం తొలగించారు. బడ్డీల కారణంగా అసాంఘిక కార్యక్రమాలు ఎక్కువవుతున్నాయని, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే బడ్డీలను తొలగించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బడ్డీలను అడ్డాలుగా చేసుకుని మందుబాబులు వీరంగం చేస్తున్నారని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ భద్రతా సిబ్బంది కోటేశ్వరరావు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓజోన్ పొర పరిరక్షణ మానవాళి బాధ్యత

ఎంవీపీ కాలనీ : ఓజోన్ పొరను పరిరక్షించుకోవడం మానవాళి బాధ్యత అని ఏయూ విశ్రాంత ఆచార్యుడు ఇ.ఉదయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీ సమత కళాశాలలో అంతర్జాతీయ ఓజోన్ డేను పురస్కరించుకుని నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లైమేట్ ఎన్జీవో సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో అత్యంత పలుచగా ఉండే ఓజోన్ పొరను కాపాడుకోకపోవడం వల్ల జరిగే నష్టం వర్ణనాతీతం అన్నారు. విద్యార్థులు పర్యావరణహితంగా జీవించడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేవీ రత్నం, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీలపై కుట్రలొద్దు

బీచ్‌రోడ్డు : ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన మెడికల్ కాలేజీలపై కుట్రలొద్దని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రియాంక దండి అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మంచి పనులను కాంగ్రెస్ స్వాగతిస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నాడు – నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా ఆధునికీకరించి, డిజిటల్ క్లాస్ రూమ్స్ అందుబాటులోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. వైద్య రంగంలో పేద విద్యార్థులకు అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో 17 వైద్య కళాశాలను అప్పటి సీఎం జగన్ తీసుకొచ్చారన్నారు. వాటిని ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఇది రాష్ట్ర భవిష్యత్‌కు, ప్రజలకు అన్యాయం చేయడమే అవుతుందన్నారు.

## రేపటి నుంచి స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్

ఆరిలోవ : స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పేరుతో విమ్స్‌లో మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షల కార్యక్రమం ఈ నెల 17 నుంచి ప్రారంభించనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. ఇందుకోసం ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సోమవారం ఆయన వైద్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు 15 రోజులపాటు ఈ కార్యక్రమం అందుబాటులో ఉంటుందన్నారు. క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు, ఈఎన్‌టీ, కళ్లు, ఊపిరితిత్తులు, అధిక బరువు తదితర సమస్యలతో బాధపడుతున్న మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి చికిత్స అందిస్తామన్నారు. వీటితోపాటు అవయవదానం, రక్తదానం, పలు వ్యాధులకు ఉచిత టీకాలు వేయడం, అవసరమైన మహిళలకు రక్త పరీక్షలతోపాటు అల్ట్రా సౌండ్ స్కానింగ్ ఉచితంగా నిర్వహించనున్నామని తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, ఆర్ఎంవో డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

## దేశం గర్వించే గొప్ప ఇంజినీర్ విశ్వేశ్వరయ్య



విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్, ఆచార్యులు

మద్దిలపాలెం : దేశం గర్వించే గొప్ప ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఏయూ ఇంజినీర్స్ కార్యాలయం వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం విశ్వేశ్వరయ్య అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ఆచార్య కె.శ్రీనివాసరావు, వి.తిరుపతిరావు, సి.ఎస్.వి.సత్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆరిలోవ : జీవీఎంసీ పన్నెండో వార్డులో పలు సమస్యలు తిష్టవేశాయని, వీధి దీపాలు వెలగకపోవడంతోపాటు అపారిశుధ్యం, తాగునీటి సమస్య, వీధి కుక్కల స్వైర విహారం, శిథిలమైన రోడ్లతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని కార్పొరేటర్ అక్కరమాని పేర్కొన్నారు. వీటితోపాటు కొండవాలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులకు ఆమె వినతిపత్రం అందజేశారు. అనంతరం నగర మేయర్ పీలా శ్రీనివాసరావుకు కూడా ఆమె వినతిపత్రం అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 20వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రీవెన్స్‌లో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముమ్మల సురేష్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని మేయర్ పీలా శ్రీనివాసరావుకు అందజేశారు. వార్డులో కాలువలు, డ్రైనేజీలు నిర్మించి, మంచి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

## చంద్రబాబు పాలనంతా మోసపూరితం



18వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కల్యాణ్, తదితరులు



పైనాపిల్‌కాలనీలో కూటమి ప్రభుత్వ మోసాలు వివరిస్తున్న మొల్లి అప్పారావు

ఆరిలోవ : రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో అంతా మోసం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆరోపించారు. జీవీఎంసీ 10, 13వ వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రభుత్వ మోసాలను వివరించారు. పదో వార్డులోని రవీంద్రనగర్ ప్రాంతం 55, 62వ బూత్‌ల పరిధిలో మొల్లి అప్పారావు మాట్లాడుతూ మహిళలు, విద్యార్థులు, కార్మికులు కూటమి పాలనలో ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థులకు తల్లికి వందనంలో కోత పెట్టారన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి చాలీచాలని బస్సులు నడుపుతూ గొడవలు పెడుతున్నారన్నారు. వార్డు అధ్యక్షుడు పతవాడ కనకరాజు, జిల్లా కార్యదర్శి బొండా శ్రీనివాస్, నాయకులు ఒమ్మి కనకరాజు, పతివాడ వెంకటలక్ష్మి, తులసి, రవీంద్ర, సయ్యద్ అబ్దుల్, శ్రీను, శ్రీహరి, నాయుడు, గురునాయుడు, కుమారి, సత్యవతి, కనక పాల్గొన్నారు.

- పదమూడో వార్డు పరిధి పైనాపిల్‌కాలనీ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. కూటమి పాలనలో సూపర్ సిక్స్ పథకాల అమలులో జరుగుతున్న మోసాలు వివరించారు. వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్, ప్రసంగి వాసు, వానపల్లి మంగరాజు, పాండ్రింకి శ్రీను, మారిక భాస్కరరావు, రాము, కామేశ్వరరావు, సూరిబాబు, బాబూరావు, గోవింద్ పాల్గొన్నారు.

**కూటమి ప్రభుత్వ మోసాలపై విస్తృత ప్రచారం**

ఎంవీపీ కాలనీ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి నాయకులు చేస్తున్న మోసాలపై నిలదీయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలకు సూచించారు. ఈ మేరకు బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం 18వ వార్డులోని 94వ నంబరు బూత్ పరిధిలో సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసి కూటమి ప్రభుత్వ మోసాలను విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్ మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నాయకులు 2024 ఎన్నికల్లో ఓటర్లను మోసం చేసి అడ్డదారిలో అధికారంలోకి వచ్చారన్నారు. హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు పేర్ల విజయచందర్, ఎల్లాజీ, పరదేశి, తేజ, వర్మ, బీఎల్ఏ అప్పలరాజు పాల్గొన్నారు.

## మూడు తులాల బంగారం చోరీ

ఆరిలోవ : ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఆరిలోవ క్రైం ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... విశాఖ వ్యాలీ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శారద జీవీఎంసీ పదో వార్డు పరిధి రాజీవ్‌నగర్‌లో నివసిస్తున్నారు. ఆమె సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి స్కూల్‌కు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆ ఇంటి తలుపులు విరగ్గొట్టి బీరువాలో ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాలు తీసుకుపోయారు. స్కూల్ నుంచి సాయంత్రం ఇంటికి వెళ్లేసరికి తలుపులు తెరిచి ఉండటం, బీరువాలో నగలు కనిపించకపోవడంతో ఆరిలోవ పోలీసులకు శారద ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హరికృష్ణ, సిబ్బంది ఇంటికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.